ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

సోమవారం 7 జూలై 2025



గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరు

మంథని, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లోని 12 గ్రామ పంచాయతీలకు నూతన భవనాల నిర్మాణానికి రూ. 2.40కోట్లు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు మంజూరు చేయించారు. మంథని మండలంలోని అడవి సోమన్‌పల్లి, ఖానాపూర్, మల్లెపల్లి, ఆరెంద, ఉప్పట్ల, గోపాల్‌పూర్, తోట గోపయ్యపల్లి, కమాన్‌పూర్ మండలంలోని సిద్ధిపల్లి, ముత్తారం మండలంలోని జిల్లల్లపల్లి, రామగిరి మండలంలో నాగెపల్లి, జల్లారం, ముస్త్యాల గ్రామపంచాయతీలకు నూతన భవనాల నిర్మాణానికి ఒక్కోదానికి రూ. 20లక్షల చొప్పున ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు.

కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా లక్ష్మి

కోల్‌సిటీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా బీ లక్ష్మిని నియమించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ శాఖలో నయాబ్ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆమెను డిప్యూటేషన్‌పై రామగుండం కార్పొరేషన్‌కు బదిలీ చేశారు.

ఆర్టీసీలో మహిళా శక్తి

- మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో 9 బస్సులు
- ఒక్కో బస్సుకు నెలకు రూ. 69,468 చెల్లింపు
- ఏడేళ్లలో రూ. 58.35 లక్షల ఆదాయం



హైదరాబాద్‌లో మండల సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల అందజేత (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో మహిళా సంఘాలచే పెడుతున్న అద్దె బస్సులతో అటు ఆర్టీసీకి, ఇటు మహిళా సంఘాలకు ప్రయోజనాల్ని చేకూరుస్తున్నది. బస్సులు కొనుగోలుతో ఆర్టీసీకి ఆర్థిక భారం తప్పగా, మహిళా సంఘాలకు లాభాన్ని చేకూరుస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ఇందిరా మహిళాశక్తి పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా స్వయం ఉపాధి పనులను గుర్తించి తద్వారా ఉపాధి పొందేందుకు గాను బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నారు. అందులో భాగంగా మహిళా క్యాంటీన్లు, డెయిరీ పార్లర్లు, కిరాణషాపులు, తదితర ఏర్పాటు చేయిస్తున్నారు. అంతేకాకుండా ఆర్టీసీలో అద్దె బస్సు లను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 151 అద్దె బస్సులను ఆర్టీసీకి మండల మహిళా సమాఖ్యల ఆధ్వ ర్యంలో కొనుగోలు చేసి అద్దెకు ఇచ్చారు. అందులో భాగంగా జిల్లాలోని 9 మండలాల నుంచి అద్దె బస్సు లను ఆర్టీసీలో పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ పల్లె వెలుగు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణ సౌక ర్యం కల్పించింది. దీంతో బస్సుల్లో రద్దీ పెరగడంతో తదనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచేందుకు ఆర్టీసీకి భారంగా మారింది. ఇప్పటికే ఆర్టీసీలో అద్దె బస్సుల వినియోగం కొనసాగుతున్నది. ప్రైవేట్ ఆపరేటర్ల నుంచి బస్సులను అద్దెకు తీసుకునే బదులు మహిళా సంఘాల చే బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీలో 600 బస్సులను అద్దెకు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఈ ఏడాది మార్చి 4వ తేదీన ఉత్తర్వులు జారీ చేయగా, అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8న కొన్ని బస్సులను రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు ప్రారంభించారు. మే 20వ తేదీ నాటికి మొత్తం 151 బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇచ్చారు. బస్సుల కొనుగోలుకు ప్రభు త్వం పేదరిక నిర్మూలన సంస్థ కమ్యూనిటీ ఇన్వెస్ట్ మెంట్ ఫండ్ నుంచి 30 లక్షల రూపాయలు మండల సమాఖ్యలకు అందజేయగా, వారు మరో 6 లక్షలు కలు పుకొని మొత్తం 36 లక్షల

(మిగతా 8వ పేజీలో)

ఆర్‌జీ-1 ఏరియాలో వన మహోత్సవం

- మొక్కలు నాటిన సీఎండీ బలరాం



మొక్కలు నాటుతున్న సింగరేణి సీఎండీ బలరాం

గోదావరిఖని, జూలై 6(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్‌జీ-1 ఏరియాలో ఆదివారం జీడీకే ఓసీపీ-5 సివిల్ డిపార్ట్‌మెంట్ ఫిల్టర్ బెడ్ సమీపంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ముఖ్యఅతిథిగా హాజరై వెయ్యిమొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా 500 మొక్కలను నాటడం జరిగినది. ఈ సందర్భంగా సీఎండీ బలరాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించటం గొప్ప కార్యక్రమమన్నారు. మొక్కలు మానవాళికి ప్రాణవాయువు అని, మొక్కల్ని నాటడమే కాకుండా వాటిని పరిరక్షించడం వల్ల భావితరాలకు ఎంతోమేలు చేసిన వారమవుతామన్నారు. ప్రతిఒక్కరు జీవితంలో ఒక భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని, నాటిన ప్రతి మొక్కను పరిరక్షించాలని తెలిపారు. సింగరేణి యాజమాన్యం పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని పర్యవేక్షిస్తున్నారని అభినందించారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో పచ్చదనాన్ని పెంచి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌జీ-1 డీ లలిత్ కుమార్ మాట్లాడుతూ వన మహోత్సవ గొప్ప కార్యక్రమమని, సీఎండీ అందరినీ ప్రోత్సహిస్తూ వన మహోత్సవ యజ్ఞంలో అంకుటిత దీక్షతో ఇప్పటి వరకు 19570మొక్కలను నాటడం గొప్ప విషయమన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని 2019లో ప్రారంభించారన్నారు. వన మహోత్సవ కార్యక్రమం చేపట్టిన సీఎండీ బలరాంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి ట్రీ మ్యాన్‌ఆఫ్ తెలంగాణ అవార్డుతో సత్కరించారని తెలిపారు. ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ మహోత్సవంలో సీఎంఓఎఐ అధ్యక్షులు బీ మల్లేష్, ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్, ఎస్ఓటూ జీఎం అంజనేయప్రసాద్, డీజీఎం(ఫారెస్ట్) కర్ణ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, నాయకులు కేస్వామి, ఆరెల్లి పోషం, అధికారులు నాగుల వేణు, హనుమంతరావు, ఇతర ఏరియా జీఎంలు ఏజెంట్లు, మేనేజర్లు పాల్గొన్నారు.

ఇసుక దందాకు చెక్ పెడతా

- కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్



మాట్లాడుతున్న మంత్రి వివేక్

గోదావరిఖని, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టి ప్రభుత్వ ఆదాయం పెంచడమే లక్ష్యమని కార్మిక, మైనింగ్‌శాఖ మంత్రి గడ్డం వివేక్ చెప్పారు. ఆదివారం రాత్రి గోదావరిఖని దుర్గానగర్‌లో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మాల మహానాడు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి వివేక్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేసేవారిని వదిలిపెట్టేది లేదని, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.3వేల కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా కేవలం రూ.670కోట్ల ఆదాయం వస్తుందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి కూడా సీరియస్‌గా ఉన్నారని, ఇసుక రవాణా ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెంచే విధంగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించినట్టు వివేక్ చెప్పారు. సింగరేణి కార్మికుల సొంతింటి కలను నెరవేర్చడం, సంస్థలోపని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. సింగరణి సంస్థను కాపాడుకోవడం, డీఎంఎఫ్‌టీ, సీఎస్‌ఆర్ నిధులు ప్రభావిత గ్రామాల్లో ఉపయోగించడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. తాను ఎప్పుడూ పదవుల కోసం ఆశపడలేదని, తెలంగాణ ఉద్యమ సమయంలో మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి ఇబ్బందులకు గురి చేసినప్పటికీ ఉద్యమానికి నాయకత్వం వహించానన్నారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ సింగరేణి కార్మికులకు పెన్షన్ పెంచాలని పార్లమెంట్‌లో గళం విప్పారని, దీంతో రూ.144కోట్లు కేటాయించారని చెప్పారు. గుమ్మడి కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు బీ వెంకట్రావ్, బాబర్ సలీంపాషా, పీ మల్లికార్జున్, కామ విజయ్, తొగరి తిరుపతి, బోయిని మల్లేష్, దుబాసి మల్లేష్, బందారపు మల్లికార్జున్, ఏఐటీయూసీ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, మడ్డి ఎల్లయ్య, వైవీరావు, రంగు తిరుపతి పాల్గొన్నారు. కార్మికశాఖ మంత్రిగా గోదావరిఖనికి వచ్చిన గడ్డం వివేక్‌కు మాల మహానాడు, కార్మిక సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. మున్సిపల్ టీ జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీ మల్లికార్జున్, కామ విజయ్ ఆధ్వర్యంలో భారీ గజ మాలను వివేక్ వేశారు. మహిళలు మంగళహారతులతో, ఒగ్గు డోలు కళాకారులతో ర్యాలీ నిర్వహించారు.

నాలాలకు మోక్షం..

- ఆధునిక పద్ధతిలో బాక్స్ డ్రైన్ నిర్మాణం
- వరద ముంపు నివారణకు కార్యాచరణ
- నాలాలను ఎస్‌టీపీలతో అనుసంధానం
- అమృత్, టీయూఎఫ్ఐడీసీ నిధుల వినియోగం



మెడికల్ కళాశాల సమీపంలో నాలా ఆధునికీకరణ పనులు

కోల్‌సిటీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన నాలాల వరద ముంపు నివారణకు చర్యలు చేపట్టారు. రామగుండం, గోదావరిఖని, ఎన్‌టీపీసీ, యైటింక్లయిన్ కాలనీల్లోని ప్రధాన నాలాలను ఆధునీకరిస్తున్నారు. టీయూఎఫ్ఐడీసీ, అమృత్ పథకం నుంచి సుమారు రూ.50కోట్లు ఈ నాలాల ఆధునికీకరణకు వెచ్చిస్తున్నారు. భవిష్యత్‌లో 50ఏళ్ల అవసరాల దృష్టిలో ఉంచుకుని కన్సల్టెంట్ల ద్వారా డిజైన్లు చేయించి పనులు మొదలు పెట్టారు. పట్టణంలోని ఇందిరా నగర్ నుంచి మార్కండేయకాలనీ, మెడికల్ కళాశాల మీదుగా సప్తగిరికాలనీ, రాజలక్ష్మి కాలనీ, అక్షర స్కూల్ మీదుగా మల్కాపురం ఎస్‌టీపీకి అనుసంధానం చేస్తున్నారు. ఇందుకు 970మీటర్ల ప్రధాన నాలాను రూ.6.5కోట్లతో ఆధునీకరిస్తున్నారు. ఇందులో 90శాతం పనులు పూర్తయ్యాయి. 4మీటర్ల వెడల్పుతో వరద ముంపును తట్టుకునే విధంగా ఈ డ్రైన్ నిర్మాణం జరుగుతుంది. జీఎం ఆఫీస్ రాజీవ్ రహ దారి నుంచి మెడికల్ కళాశాల వరకు రూ.5కోట్లతో డ్రైన్ నిర్మించారు. 5మీటర్ల వెడల్పుతో దీని నిర్మాణం జరిగింది. ఈ నాలాను మెడికల్ కళాశాల వద్ద ప్రధాన నాలాకు అనుసంధానం చేశారు. మెడికల్ కళాశాల ప్రాంగణంలో సుమారు 150మీటర్లు 5మీటర్ల వెడల్పుతో బాక్స్ డ్రైన్ నిర్మించారు. డ్రైన్‌పైన స్లాబ్ వేసి అక్కడ రూ.70లక్షలతో పార్కు నిర్మాణం చేస్తున్నారు.

నగర ప్రధాన నాలాపై స్లాబ్... బాక్స్ పద్ధతిలో నిర్మాణానికి అనుమతులు

గోదావరిఖని పట్టణంలో ప్రధాన నాలా అయిన ఆర్ఎఫ్‌సీఎల్- అడ్డగుంటపల్లి చెరువు - కళ్యాణ్‌నగర్ - 2ఏ మోరీ నాలాను ఆధునిక పద్ధతిలో నిర్మిస్తున్నారు. ఈ నాలా నివాసాల గుండా ప్రవహిస్తుండడంతో వరద ముంపు ఏర్పడుతుంది. పూడిక తీసేందుకు వీలు లేకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తుంది. దీంతో ఈ నాలాను ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి 2ఏ మోరీ వరకు ఆధునీకరించాలని నిర్ణయించారు. ఆర్ఎఫ్‌సీఎల్, తిలక్‌నగర్‌ల నుంచి ఓపెన్ డ్రైన్లు నిర్మించి అడ్డగుంటపల్లి నుంచి కాలనీల మధ్య బాక్స్‌టైపు డ్రైన్ నిర్మించనున్నారు. ఇందుకు గాను అమృత్ నిధులను వెచ్చిస్తున్నారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాలకు ఇంజనీర్లను పంపించి నక్సల్టెంట్ల ద్వారా డిజైన్లు చేయించారు. ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో అమృత్ నిధుల నుంచి ఈ డ్రైన్ నిర్మాణం చేస్తున్నారు. సుమారు 3.5మీటర్ల నుంచి 4మీటర్ల వెడల్పుతో సుమారు 2.5కిలో మీటర్లు ప్రధాన నాలాను నిర్మించి దానిపై స్లాబ్ నిర్మాణం చేయనున్నారు. అనంతరం నాలాపైన రహదారిగా వినియోగించుకునే విధంగా డిజైన్ చేశారు. ఈ మేరకు ప్రజారోగ్య శాఖ ఆమోదం కూడా తెలిపింది. కళ్యాణ్‌నగర్‌లో పనులు కూడా మొదలయ్యాయి. అలాగే రామ గుండం జీరో పాయింట్, ఎన్‌టీ పీసీ, యైటింక్లయిన్‌కాలనీల్లో కూడా అమృత్ నిధులతో డ్రైన్ల నిర్మాణం జరుగుతుంది.



శ్రీనివాస థియేటర్ వద్ద బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులు

ఆక్రమణలతోనే సమస్య

నాలాలను ఆదునీకరించే పనులు కొనసాగుతున్నా ఆక్రమణలతోనే సమస్యలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా మార్కండేయకాలనీ వంటి ప్రాంతాల్లో ఆక్రమణలతో ఆరు నెలలు నాలా ఆధునీకరణ ఆలస్యమైంది. ఇప్పుడు అడ్డగుంటపల్లి నుంచి 2ఏ మోరీ వరకు సుమారు 10డివిజన్ల గుండా ప్రవహించే ప్రధాన నాలాను బాక్స్ టైపు నాలాగా ఆధునీకరిస్తున్నారు. ఈ నాలా వెంట అన్నీ చోట్ల ఆక్రమణలు ఉన్నాయి. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం ఆక్రమణలు తొలగిస్తేనే ఇక్కడ పనులు ముందుకెళ్లే అవకాశం ఉంటుంది. దీనికి తోడు ఈ డ్రైన్ పక్కన ఇరువైపులా యూజీడీ నిర్మాణం చేసి సీవరేజ్ లైన్లను ఇందులో కలిపేలా ప్రతిపాదన చేశారు. ఈ యూజీడీ లైన్లను రైల్వే ట్రాక్ కింద నుంచి ఎస్‌టీపీ వరకు నిర్మించనున్నారు.

నాలాలకు ఇరువైపులా ఇనుప కంచెలు...

కార్పొరేషన్‌లో ఆధునీకరిస్తున్న నాలాలకు ఇరువైపులా ఇనుప కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. ఓపెన్ నాలాల్లో చెత్త వేయకుండా 12అడుగుల ఎత్తు వరకు ఈ కంచెలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు నాలాల నిర్మాణ సమయంలోనే ఏర్పాట్లు చేస్తున్నారు. టెండర్లలో నాలా నిర్మాణాలకు అప్పగించిన పనుల్లో కంచె నిర్మాణాన్ని పొందుపరిచారు.

ప్రధాన నాలాల పక్కనే యూజీడీలు

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో అమృత్ నిధులతో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నిర్మిస్తుండడంతో ఓపెన్ నాలాలను, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను వేర్వేరుగా ఎస్‌టీపీలకు అనుసంధానం చేయాలని ప్రణాళికలు చేస్తున్నా రు. దీనిలో భాగంగా ప్రధాన నాలాల పక్కనే యూజీడీ లైన్లను నిర్మిస్తారు. వాటిని జీడీకే 2ఏ, మల్కాపూర్, యైటింక్లయిన్‌కాలనీల్లో నిర్మిస్తున్న సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు అనుసంధానం చేస్తారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించింది.

ఆరు బయటే వంట నిర్వాహకుల తంటా...

- ఏళ్ళ తరబడి గదులు లేక ఇబ్బందులు



ఓదెల మోడల్ హైస్కూల్ ఆవరణలో మధ్యాహ్న భోజనాలను తయారు చేస్తున్న మహిళలు

ఓదెల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వంట గదులు లేక ఆరుబయట వండుతున్నారు. దీంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. 18 ఏళ్ల నుంచి మధ్యాహ్న భోజనం తయారీకి వంట గదులు సక్రమంగా లేక చెట్ల నీడలో, పాఠశాలల ఆవరణలో మధ్యాహ్న భోజనాన్ని తయారు చేస్తున్నారు. 2007లో అప్పటి ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులోకి తెచ్చింది. ఓదెల కేంద్రంలోని మోడల్ హైస్కూల్, సిపిఎస్, పిఎస్ (ఎస్సీ కాలనీ) తో పాటు గుంపుల హైస్కూల్, కనగర్తి, గూడెం, ఇందుర్తి, రూపు నారాయణపేట, భగత్‌సింగ్ నగర్ పిఎస్, నాంసానిపల్లి యుపిఎస్ తదితర పాఠశాలలో ఇప్పటివరకు మధ్యాహ్న భోజనానికి వంట గదులు సక్రమంగా లేవు. అలాగే మిగతా కొన్ని పాఠశాలల్లో ఉన్నప్పటికీ పాక్షికంగా దెబ్బతిని వర్షాకాలంలో ఇబ్బంది లకు గురవుతున్నారు. వంట గదులు లేని దగ్గర నిర్మాణం లేదు, ఉన్న దగ్గర మరమ్మతు లేవు, దీంతో ఏజెన్సీలు ఈ వర్షాకాలంలో వంటలు తయారు చేయడానికి ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా వంట చెరుకు తడిసిపోయి పొయ్యిలకు ఉపయోగపడడం లేదు. దీంతో విద్యార్థుల సమయానికి భోజనాలను తయారు చేయడం మహిళలకు కత్తి మీద సాముల మారింది. మిగతా పాఠశాలల్లో మరమ్మతులకు నోచని వంట గదిలో భద్రపరిచిన బియ్యం, వంట సామగ్రి తడిసిపోతోంది. అధికారులు స్పందించి వంట గదుల మరమ్మతులు, గది మంజూరైన మోడల్ హైస్కూల్ లో నిర్మాణం చేపట్టాలని విద్యార్థులు, గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతు కోసం ప్రతిపాదనలు పంపాం

- ఎంఈవో రమేష్



మండలంలో పాక్షికంగా దెబ్బతిన్న వంట గదుల మరమ్మతు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాం. మోడల్ హైస్కూల్ లో వంటగది నిర్మించాల్సి ఉంది. మండలంలో ఉన్న పాఠశాలల్లో ఎలాంటి మరమ్మతు చేపట్టాలో నివేదికలు తయారుచేసి అధికారులకు అందజేశాం. త్వరలోనే మంజూరైన వంటగది నిర్మాణంతో పాటు ఇతర వంట గదుల్లో సమస్యలు లేకుండా పరిష్కారిస్తాం.

పని గంటల పెంపు జీవోను రద్దుచేయాలి



పెద్దపల్లిలో సీఐటీయూ నాయకుల నిరసన

పెద్దపల్లిటౌన్/జ్యోతినగర్,జూలై6 (ఆంధ్రజ్యోతి): పనిగంటలు పెంచుతూ విడుదల చేసిన జీవో 282ను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం జీవో ప్రతులను దహనం చేశారు. అనంతరం జిల్లా సహాయకార్యదర్శి సీపెల్లిరవీందర్ మాట్లాడుతూ శ్రమశక్తిని దోచి కార్పొరేట్లకు అధిక లాభాలు కట్టబెట్టాలనే ఉద్దేశ్యంతో మోదీ సర్కార్ నాలుగు లేబర్‌కోడ్లను తీసుకువస్తోందన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా ఈనెల 9న సార్వత్రిక సమ్మెలోకి వెళ్తుందన్నారు. ఈ క్రమంలో గుజరాత్‌లో కార్మికులు పదిగంటలు పనిచేయాలని బీజేపీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా 10గంటల పనిని చట్టబద్ధం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జీవో నెంబర్ 282ను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే ఎన్టీపీసీ మేడిపల్లి సెంటరులో ధర్నా చేశారు. నాయకులు జంగపల్లి నరేష్, ముస్తఫా, బొంకూరి సాగర్, పల్లె రవి, కుమ్మరి నవీన్, మధు, ఎన్.భిక్షపతి, ఎం.రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ధర్మారం జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులశాఖ మంత్రి అడ్లూరిలక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో తెలంగాణ గురుకులాల కాంట్రాక్టర్‌తో పాటు మండలంలోని ఆర్ఎంపీ డాక్టర్ల సంఘం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలకు పెంచడంతోనే గురుకులాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందుతుందన్నారు. గురుకులాల కాంట్రాక్టర్స్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగారావు రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టర్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అడ్లూరి హామీ ఇచ్చారు. ఆర్ఎంపీల సంఘం ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. ఆర్ఎంపీల సంఘ భవనానికి విద్యుత్ సౌకర్యం కోసం ట్రాన్స్‌ఫార్మర్, నీటి సౌకర్యం కోసం బోర్‌వెల్, సంఘ భవన ప్రహరీ నిధుల మంజూరు చేయాలని కోరారు. అనంతరం మొహర్రం సందర్భంగా మండల కేంద్రంలో పీరీలను మంత్రి దర్శించుకున్నారు. ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, ఆర్ఎంపీల మండల అధ్యక్షుడు పుచ్చకాయల మునీందర్, ఎండీ బాబ పాల్గొన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న హాస్టల్ కాంట్రాక్టర్లు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఓదెల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోత్కపల్లి యూనియన్ బ్యాంక్ వద్ద ఆదివారం రెండు వాహనాలు ఢీకొన్న సంఘటనలో గుంపులకు చెందిన ఆరేపల్లి జశ్వంత్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పొత్కపల్లి నుంచి ద్విచక్రవాహనంపై గుంపుల వైపు వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో జశ్వంత్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనం ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. దీంతో క్షతగాత్రుడిని జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు.

పొరండ్లలో ఆర్ఎంపీ క్లినిక్ తనిఖీ

తిమ్మాపూర్ (మానకొండూర్), జూలై 6 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలంలోని పొరండ్ల గ్రామంలో గల ఆర్ఎంపీ వైద్య క్లీనిక్‌ను టీజీఎంసీ సభ్యుడు యగ్గన్న శ్రీనివాస్ ఆదివారం తనిఖీ నిర్వహించారు. రోగులకు యాంటీబయాటిక్ ఇంజక్షన్‌లు, స్టెరాయిడ్, ఇంజక్షన్‌లు పేయిన్ కిల్లర్ ఇంజక్షన్‌లు ఇస్తున్నట్లు తనిఖీలో గుర్తించారు. దీనికి అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులో ఫార్మసిస్ట్ లేకుండా ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇస్తున్నట్లు గుర్తించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

పేకాట రాయుళ్లపై కేసు

కరీంనగర్ క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వారి వద్ద 9,320 రూపాయలను స్వాధీనం చేసుకున్నామని, పోలీస్ స్టేషన్‌కు తరలించి నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు.



చొప్పదండిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్

ఇంటిగ్రేటెడ్ హాస్టల్ పిలుస్తోంది..

- అధునాతన భవనం.. ఆధునిక వసతులు
- 400 మంది విద్యార్థులకు అవకాశం

చొప్పదండి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థులను పిలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో సహా ఓసీ వర్గాలకు చెందిన మూడో తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఈ హాస్టల్‌లో ప్రవేశం కల్పిస్తారు. 400 మంది విద్యార్థుల కోసం అధునాతనమైన భవనాన్ని ఐదేళ్ల క్రితం నిర్మించగా, విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్ పట్టణం నడిఒడ్డున ఉండి అందరికి అందుబాటులో ఉంది. ప్రస్తుతం హాస్టల్‌లో 200 మంది విద్యార్థులు ఉండగా మరో 200 ఖాళీలు ఉన్నాయి.



యోగా చేస్తున్న విద్యార్థులు



భోజనశాలలో విద్యార్థులు

● విద్యార్థులకు పోషకాహారం...

హాస్టల్‌లో విద్యార్థులకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. వారానికి రెండుసార్లు చికెన్, రోజు ఎగ్‌తోపాటు అరటిపండు, ఉదయం రాగిజావను అందిస్తున్నారు. ఉదయం అల్పాహారంలో పూరి, ఇడ్లి, ఉప్మా, పొంగలి, కిచిడిని ఇస్తున్నారు. సాయంత్రం స్నాక్స్ అందిస్తుండగా, విద్యార్థులకు స్వెటర్లు, దుప్పట్లు, బ్యాంకెట్లను అందిస్తున్నారు. స్నానానికి వేడినీటి సౌకర్య ఉండగా, తాగడానికి మినరల్ వాటర్ ప్లాంట్‌ను హాస్టల్‌లో నెలకొల్పారు. హాస్టల్ ఆవరణలో విద్యార్థులకు క్రీడా మైదానం ఉండగా ప్రతిరోజు వ్యాయాయం చేయిస్తుంటారు. ఇద్దరు వార్డెన్లతోసహా ఒక అధికారి పర్యవేక్షణలో ఈ హాస్టల్ నడుస్తోంది.



విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి...

- సత్యనారాయణ, హాస్టల్ వార్డెన్



తమ హాస్టల్‌లో అన్ని వసతులను విద్యార్థులకు కల్పిస్తున్నాం. విద్యార్థులు హాస్టల్‌లో చేరి ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి. వదశాతం ఉత్తీర్ణత శాతం సాధించేందుకు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



పోషయ్య(ఫైల్)

వీర్నపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించలేక, అనారోగ్యంతో ఉన్న కూతురికి వైద్యం చేయించలేక ఉరేసుకొని ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి పోషయ్య (60) కూలీ పనితోపాటు కొంత తనకున్న ఎకరన్నర భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కూతురు తిరుమల(25) చిన్నతనం నుంచి షుగర్ వ్యాధితో బాధపడుతోంది. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో సుమారు ఐదు లక్షల రూపాయల వరకు అప్పులయ్యాయి.

కూతురు ఆరోగ్యం కుదుటపడకపోవడం, ఆసుపత్రుల్లో చూపించేందుకు డబ్బుల్లేక తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం గ్రామశివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య రాజవ్వ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనారోగ్యంతో ఉన్న బిడ్డ కన్నీరు పెడుతూ తండ్రి చితికి నిప్పు పెట్టడం పలువురిని కలిచివేసింది.

పురుగుల మందు తాగి యువకుడు..

ముత్తారం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడివిశ్రీరాంపూర్‌కు చెందిన చొప్పరి సదానందం (35) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సదానందం తాగుడుకు బానిసై ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. శనివారం ఉదయం బయటకు వెళ్తున్నానని చెప్పి సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో భార్య చొప్పరి భారతితోపాటు కుటుంబసభ్యులు గ్రామంలో వెతుకగా ఊర చెరువు దగ్గర తాగిన మత్తులో పురుగుల మందు కిందపడిపోయి ఉన్నాడు. గమనించిన కుటుంబసభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు సదానందం భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో తాటిచెట్టు పైనుంచి పడి వెంగలి శంకరయ్య అనే గీతకార్మికుడికి ఆదివారం గాయాలయ్యాయి. వెంగలి శంకరయ్య కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కుతుండగా మోకుజారి కింద పడిపోయాడు. కార్మికులు చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని గీత కార్మికుడి దుర్మరణం



ఐలు మల్లేష్ (ఫైల్)

ఓదెల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఐలు మల్లేష్ (36) అనే గీత కార్మికుడు బెల్లంపల్లిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఓదెలకు చెందిన మల్లేష్ మూడు సంవత్సరాల క్రితం బెల్లంపల్లి మండలం కాసిపల్లికి గౌడ వృత్తి చేసేందుకు వలస వెళ్లాడు. శనివారం రాత్రి బెల్లంపల్లిలో మిత్రుడి శుభకార్యానికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

మృతుడికి భార్య రాధిక, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మల్లేష్ మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. మల్లేశం నేత్రాలను సదాశయ ఫౌండేషన్ సేకరించారు. ఓదెలలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

పొలానికి దారి కోసం గొడవ

- ఒకరిపై దాడి..తీవ్రగాయాలు
- చికిత్స కోసం ఆసుపత్రికి తరలింపు

కథలాపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పొలానికి దారి కోసం జరిగిన గొడవలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం కథలాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం... తిక్క మల్లేశ్ అనే రైతుకు పక్కనే ఉన్న తిక్క రాహుల్‌కు కొంతకాలంగా దారి కోసం గొడవ జరుగుతోంది. మల్లేశ్ ట్రాక్టర్‌పై వెళ్లి దున్ని ఇంటికి వస్తున్న క్రమంలో రాహుల్, ఆదిత్య పారతో కొట్టగా తీవ్రగాయాలయ్యాయి. తలనుంచి రక్తస్రావం కావడంతో మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కోరుట్లకు పంపించారు. దాడికి పాల్పడ్డ రాహుల్, ఆదిత్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. నిందితులు పరారీలో ఉన్నట్టు చెప్పారు.

ద్విచక్రవాహనం, కారు ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూరు గ్రామ శివారులో ప్రధాన రహదారి వద్దగల వైన్స్ సమీపంలో కామారెడ్డి వైపు వెళుతున్న టిఎస్03ఇజె1008 అనే కారు సిరిసిల్ల వైపు వస్తున్న ద్విచక్రవాహన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న సిరిసిల్ల పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన బరిగెల అరుణ్‌కుమార్(29), నెహ్రూనగర్‌కు చెందిన తడుక సాయిచరణ్ (27)లకు తీవ్రగాయాలయ్యాయి. బరిగెల అరుణ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. సంఘటనా స్థలానికి టౌన్ సీఐ కృష్ణ వెళ్లి రహదారిపై ఉన్న వాహనాలను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

స్కూటీని ఢీకొట్టిన లారీ: ఇద్దరికి గాయాలు

కొడిమ్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న కొడిమ్యాల మండలంలోని తురుకకాశీనగర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఎస్సై ఎస్ సందీప్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని సంద్రల్లపల్లి గ్రామానికి చెందిన బుచ్చిబాబు అతనికి వరుసకు కుమారుడైన చంద్రగిరికి చెందిన జూపాక మారుతి వర్షిత్ నమిలికొండ నుంచి గంగాధరకు పనినిమిత్తం స్కూటీపై వెల్లుతుండగా లారీ ఢీకొట్టగా ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. గాయాలాపాలైన ఇద్దరిని 108వాహనంలో చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌కు చెందిన సెంట్రింగ్ కార్మికుడు సునీల్ విశ్వకర్మ(31) శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. సునీల్ విశ్వకర్మ చైతన్యపురి కాలనీలో ఒక భవనం నిర్మాణ పనుల్లో స్లాబ్ కోసం ఇనుక సలాకలను మిషన్‌తో కట్ చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగిపోయి సునీల్ ప్రమాదానికి గురయ్యాడు. అక్కడే ఉన్న ఇంటి యజమాని, తోటి కార్మికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. సునీల్ విశ్వకర్మ భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవులు పట్టివేత

ధర్మపురి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం చెక్ పోస్ట్ వద్ద ఆదివారం మధ్యాహ్నం వెహికల్ తనఖీ చేస్తున్న సమయంలో ఒక పికప్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఆవులను పట్టుకొన్నట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. మధ్యాహ్నం వేళలో వాహనాన్ని తనఖీ చేశామన్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి వాహనంలోని ఎనిమిది ఆవులు, రెండు లేగ దూడలను గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్నారి హత్య కేసులో వీడుతున్న మిస్టరీ

- చిన్నమ్మపైనే అనుమానం
- పోలీసుల అదుపులో అనుమానితురాలు

కోరుట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఆదర్శనగర్‌లో శనివారం జరిగిన హితీక్ష(5) అనే చిన్నారి హత్య కేసు మిస్టరీ వీడుతోంది. ఈ కేసులో పోలీసులు పలు కీలక ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది. పోలీసులు విచారణ చేపట్టి ఆమె చిన్నమ్మ మమత పైనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి హితీక్ష మమతకు తోటి కోడలు కూతురు. హత్య జరిగిన వెంటనే ఎస్పీ అశోక్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మొదట హితీక్ష మృతదేహం దొరికిన ఇంటి యజమాని విజయ్ వివరాలను సేకరించగా అతడు వరంగల్ జిల్లాలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విజయ్‌ని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టిన పోలీసులు ఆదివారం విడిచి పెట్టారు. సంఘటనా స్థలం దగ్గర పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టగా అవి హితీక్ష ఇంటిలోకి వెళ్లి నిలిచి పోవడంతో పోలీసులు ఆ కోణంలో విచారణ చేపట్టారు. ఇంట్లో ఉన్నవారి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని ఇంటి పరిసరాల్లో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఇంట్లోకు వచ్చి పోయేవారి వివరాలతో పాటు హితీక్ష చిన్నమ్మ మమత ఫోన్ డేటాను పరిశీలించారు.



చిన్నారి మృతదేహంపై పడి విలపిస్తున్న తండ్రి రామ్, ఇన్‌సెట్‌లో హితీక్ష (ఫైల్)

● వివాదాస్పదంగా మమత వ్యవహారం

మమత సెల్‌ఫోన్‌లో హత్య చేయడానికి సంబంధించిన కొన్ని వీడియో క్లిప్పింగులను గుర్తించి న పోలీసులు ఆ కోణంలో విచారణ చేపట్టారు. తొలుత మమత ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు కొద్దిసేపటి అనంతరం తిరిగి అందించారు. మరికాసేపటికి మమత ఫోన్‌ను తీసుకొని తనిఖీ చేయగా అందులో మమత డౌన్‌లోడ్ చేసిన వీడియోలు లేకపోవడంతో ఆమెపై అనుమానం వ్యక్తం చేసి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. హత్య జరిగిన ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించగా మమత సాయంత్రం 6:30 గంటల నుంచి మృతదేహం దొరికే వరకు ఐదుసార్లు అదే ప్రాంతానికి వచ్చిపోయినట్లు పోలీసులు గుర్తించారు. సంఘటన సమయంలో మమత వేసుకున్న లెగ్గిన్, హితీక్షను ఆసుప్రతికి తీసుకువచ్చిన సమయంలో ధరించిన లెగ్గిన్ వేరుగా ఉండడంతో పోలీసులు మరింత లోతుగా విచారణ చేపట్టారు. హితీక్ష కోసం బంధువులు వెతుకుతున్న సమయంలో మమత పట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్ వైపు వెళ్లి వచ్చినట్లుగా తెలుస్తోంది. చిన్నారి హత్య కోసం వాడిన పరికరాలతో పాటు మమత వేసుకున్న లెగ్గిన్‌ను పట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్ వద్ద పడేసినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఈ కేసులో మమతతో పాటు ఎవరైనా ఉన్నారా అన్న విషయంపై పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

● ఆన్‌లైన్ బెట్టింగుల్లో రూ.25లక్షల నష్టం

పట్టణంలోని ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన ఆకుల మదన్-లక్ష్మి దంపతులకు రామ్, లక్ష్మణ్ అనే ఇద్దరు కవల కుమారులు, ఓ కూతురు ఉంది. మదన్ తన ఇద్దరు కుమారులు రామ్, లక్ష్మణ్‌లకు ఎనిమిది సంవత్సరాల క్రితం నవీన, మమతలతో ఒకే వేదికపై వివాహం జరిపారు. రామ్, లక్ష్మణ్‌లు తండ్రి మదన్‌తో కలిసి గల్ఫ్ దేశానికి ఉపాధి నిమిత్తం వెళ్లి వస్తుంటారు. రామ్-నవీన దంపతులకు కుమారుడు వేదాక్ష్, కూతురు హితీక్ష ఉన్నారు. లక్ష్మణ్-మమత దంపతులకు శ్రీహశ్రీ, మహనీయ అనే ఇద్దరు కూతుర్లు ఉన్నారు. రామ్, లక్ష్మణ్, తండ్రి మదన్ గల్ఫ్ దేశానికి వెళ్లగా నవీన, మమత వారి అత్త లక్ష్మితో కలిసి ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఎంబీఏ పూర్తి చేసిన మమత కోరుట్లలోని కంప్యూటర్ సెంటర్‌లో ఉద్యోగం చేస్తోంది. మమత ఆన్‌లైన్ బెట్టింగులతో పాటు బిట్ కాయిన్‌లో పెట్టుబడి పెట్టి 25 లక్షల రూపాయలు నష్టపోయినట్లు తెలిసింది. డబ్బులు పోగొట్టుకోవడంతో పాటు ఇంట్లో చిన్నచూపు చూస్తున్నారని మమత తన తోటి కోడలు నవీనపై కక్ష పెంచుకొని ఆమె కూతురు హితీక్షను హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

గల్ఫ్ నుంచి వచ్చిన చిన్నారి తండ్రి

కోరుట్ల (ఆంధ్రజ్యోతి): కూతురు హత్యకు గురైన విషయం తెలుసుకున్న హితీక్ష తండ్రి రామ్, తాత మదన్ గల్ఫ్ దేశ నుంచి ఆదివారం కోరుట్ల పట్టణానికి చేరుకున్నారు. హితీక్ష మృతదేహంపై పడి తల్లిదండ్రులు రామ్-నవీన రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అనంతరం హితీక్ష అంత్యక్రియలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెట్‌పల్లి డీఎస్పీ అడ్డూరి రాములు, కోరుట్ల, మెట్‌పల్లి సీఐలు సురేష్ బాబు, అనిల్ కుమార్, ఎస్ఐలు చిరంజీవి, కిరణ్ కుమార్, నవీన్, శ్యాంరాజు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

కేసు రాజీ చేసుకోవాలని బెదిరింపులు

-ఒకరి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నం చేసిన రాములు

ధర్మారం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఓ కేసు విషయం లో రాజీ చేసుకోవా లని పెద్ద మనుషలతో పాటు ఎస్ఐ బెదిరింపు లకు పాల్పడుతున్నారని ఓ వ్యక్తి ఆత్మహ త్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండ లం నందిమేడారం గ్రామానికి చెందిన కొండ రాములు గౌడ్ (50) కుమారుడు కొండ సాగర్ ఓ ప్రేమ వ్యవహారంలో నాలుగు సంవత్సరాల క్రితం హత్యకు గురయ్యాడు. దానికి సంబంధించిన కేసు పెద్దపల్లి జిల్లా కోర్టులో ఉండగా ఇటీవల ట్రయల్‌కు వచ్చింది. ఈ నేపథ్యంలో హత్యకు గురైన వ్యకి కుటుంబ సభ్యులను కేసును రాజీ చేసుకోవాలని గ్రామానికి చెందిన ముగ్గురు పెద్ద మనుషులు ఒత్తిడి తీసుకు వచ్చారు. దీంతో కొండ రాములు గౌడ్ ధర్మారం ఎస్ఐ శీలం లక్ష్మణ్‌కు శనివారం ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ పెద్ద మనుషుల కే వత్తాసుపలికి రాములు పైనే కేసు పెడతానని బెదిరించాడని రాములుగౌడ్ కుమారుడు హరీష్ చెప్పాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రాములు గౌడ్ డయల్ 100కు ఫోన్ చేసి ఎస్ఐ కేసు పెడుతానని బెదిరిస్తున్నాడని, తాను పురుగుల మందు తాగుతున్నానని చెప్పి పురుగుల మందు తాగాడు. సమాచారం అందుకున్న పోలీసులు కొండ రాములు ఇంటికి వెళ్లి కొడుకు హరీష్ సహాయంతో ఘటన స్థలానికి చేరుకొని రాములును చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

● రూ.22 లక్షలే ఆత్మహత్యాయత్నానికి కారణమా?

కేసు రాజీ చేసుకోవాలని పెద్ద మనుషుల సమక్షంలో 22 లక్షల రూపాయలకు ఒప్పందం చేసుకొన్న కొండ రాములు అకౌంట్లో డబ్బులు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ పేపర్ రాసుకున్నట్లు తెలిసింది. కేసు ట్రయల్‌కు వస్తున్న నేపథ్యంలో కొండ రాములు రాజీకి ఒప్పుకోవడం లేదని, 22 లక్షల రూపాయలు తిరిగి ఇవ్వాలని పెద్దమనుషులు ఒత్తిడి తెచ్చినట్లు తెలుసింది. ఈ విషయమై ఎస్ఐ లక్ష్మణ్‌ను వివరణ కోరగా పెద్ద మనుషులు తనను బెదిరిస్తున్నారని, తనకు సహాయం చేయాలని రాములు తనకు ఫిర్యాదు చేశాడన్నారు. నాలుగు సంవత్సరాలుగా కోర్టులో కేసు నడుస్తుండగా తాను అందులో జోక్యం చేసుకోలేనని రాములుకు నచ్చజెప్పానే తప్ప ఎలాంటి బెదిరింపులకు పాల్పడలేదని తెలిపారు.

కాల్వ నర్సయ్య ఆశయ సాధనకు ఉద్యమిద్దాం



చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

భగత్‌నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక నేత కాల్వ నర్సయ్య యాదవ్ ఆశయ సాధనకు ఉద్యమించాలని సీపీఐ నాయకులు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ అన్నారు. ఆదివారం కార్మిక నేత ప్రజా ఉద్యమాల నాయకుడు కాల్వ నర్సయ్య ఆరో వర్ధంతి సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాల్వ నరసయ్య యాదవ్ కార్మికుల కోసం జీవితాన్ని అంకితం చేశారన్నారు. కాల్వ నర్సయ్య యాదవ్ ఆశించిన ఆశయాల కోసం ప్రతి ఒక్క కమ్యూనిస్టు కార్యకర్త పని చేయాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు జంగా తిరుపతి యాదవ్, జంగ కొమురయ్య యాదవ్ దానవేణి రమేష్ యాదవ్ గామినేని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



- నాలుగేళ్లుగా ఎదురుచూపులు
- ప్రభుత్వం స్పందించాలంటున్న డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు

ఇళ్ల పట్టాలు ఇచ్చేదెన్నడో?

మల్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): డబుల్‌బెడ్ రూం ఇళ్లు అందించిన అధికారులు వాటికి సంబందించిన పట్టాలు అందించకపోవడంతో లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మల్యాల మండలం నూకపల్లి, పోతారం, రామన్నపేట గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదల కోసం నూకపల్లి శివారులో గత ప్రభుత్వ హయాంలో 65 మందికి డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మించారు. ఆ ఇళ్లను 2021 అక్టోబరు 14న అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు ఇళ్లు అందజేశారు. అప్పటి నుంచి ఇళ్లకు పట్టాలు లేక ఇంటి నంబర్లు కేటాయించడం లేదు. దీంతో 65 ఇళ్లకు సంబంధించి సీరియల్ నంబర్లపైనే ఇంటి పన్నులు చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

నాలుగు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఇంటి పట్టాలు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పలు సౌకర్యాలు అందుకో లేకపోతున్నామని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇంటి పట్టాలు ఇస్తే వాటి ద్వారా ఇంటి పన్నులు చెల్లించడం, ఇతరత్రా సౌకర్యంగా ఉంటుందని అంటున్నారు.

● పట్టాలు ఇవ్వాలి

స్వప్న, లబ్ధిదారు



ఇళ్లు అందించి నాలుగు సంవత్సరాలు అవుతున్నప్పటికీ పట్టాలు ఇవ్వడం లేదు. దీంతో తాము నష్టపోవాల్సి వస్తోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన్నప్పటికీ చర్యలు తీసుకోవడంలేదు. వెంటనే తమకు అందించిన ఇళ్లకు పట్టాలు అందించాలి.

● ఇంటి పన్నులు చెల్లిస్తున్నాం

కాసారపు పద్మ, లబ్ధిదారు



ఇంటి నంబర్లు లేకున్నా మాకు కేటాయించిన ఇళ్ల సీరియల్ నంబర్ ఆధారంగా ఇంటిపన్నులు చెల్లించాల్సి వస్తోంది. తమకు పట్టాలు ఇప్పించి ఇళ్లకు నంబర్లు కేటాయించాలి.

వైభవంగా బోనాల ఉత్సవాలు



చిన్న మెట్‌పల్లిలో బోనాల శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

హుజూరాబాద్/జమ్మికుంట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, జగిత్యాల జిల్లాలో ఆదివారం బోనాల సందడి నెలకొంది. హుజూరాబాద్ పట్టణంలోని యాదవ్ నగర్ నుంచి గొల్ల కురుమలు, జమ్మికుంట పట్టణంలోని అబాది జమ్మికుంటలో కురుమ, గొల్లలు బీరప్ప బోనాలను వైభవంగా నిర్వహించారు. పురవీధులు గుండా, డప్పు చప్పుళ్లతో బీరప్ప దేవాలయం చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు బాగుండేలా మమ్మల్ని చల్లగా చూడాలని దేవుడిని వేడుకుంటామని కులపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో కులస్థులు, పెద్దలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆదివారం మహాలక్ష్మి దేవతకు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు నెత్తిన బోనాలను పెట్టుకొని శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్ర గ్రామం నుంచి గ్రామ శివారులోని మహాలక్ష్మి దేవాలయం వరకు జరిగింది. అనంతరం మహాలక్ష్మి దేవతకు మహిళలలు బోనాలను సమర్పించగా పోతరాజులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో వనభోజనాలు జరిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో ఆదివారం పోచమ్మ బోనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామశివారులో కొలువైన అమ్మవారి సన్నిధిలో గ్రామస్థులు ఉదయం నుంచి పూజలు చేశారు. ఇంటికొకరు చొప్పున మహిళలు బోనాలు తీసి పుర వీధుల వెంట డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో నైవేద్యం సమర్పించారు. పోతురాజులు చేసిన విన్యాసాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ బోనమెత్తి అమ్మవారికి సమర్పించారు. బోనాలు చూసేందుకు దుంపెట, భూషణరావుపేట గ్రామాల నుంచి తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బైర హేమలతమల్లేశ్, మహేశ్, నర్సారెడ్డి, గంగారెడ్డి, వివిధ కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

- ప్రాజెక్టులోకి 6,090 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం వరద నీరు కొనసాగింది. డ్యామ్‌లోకి 6,090 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు సామర్థ్యం 80.5 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 18.443 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 11.545 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతర అవసరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 654 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 7.590 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 1.934 టీఎంసీల నీటిని వ్యయం చేశారు.

గంగనాల ఆయకట్టు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములకుర్తి గ్రామం గోదావరి నది తీరంపై ఉన్న గంగనాల ఆయకట్టు నీటిని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విడుదల చేశారు. అంతకు ముందు గోదావరి నదికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ ఆయకట్టు కింద మండలంలోని వేములకుర్తి, యామాపూర్, ఫకీర్ కొండాపూర్, మల్లాపూర్ మండలంలోని నడికుట, మొగిలిపేట్, ఓబులాపూర్, సంగం శ్రీరాంపూర్, దామరాజ్‌పల్లి గ్రామాల్లో సుమారుగా నాలుగువేల ఎకరాలకు తాగునీరు అందుతుందని వివరించారు. రైతులు రెండు పంటలు సాగు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుమ్మల గంగన్న, యామాపూర్ పీఏసీఎస్ చైర్మన్ అంకతి రాజన్న, నాయకులు దేశెట్టి రాజారెడ్డి, నాంపల్లి వెంకటాద్రి, బుర్రిముత్యం, అశోక్, కళ్యాడ నరేందర్ తోకల సత్తయ్య పాల్గొన్నారు.



నైవేద్యంపై దాటుతున్న పశువులు (ఫైల్)

తండాల్లో 'శీత్లాభవాని' సందడి



మొక్కులు చెల్లించుకుంటున్న గిరిజనులు (ఫైల్)

- పశువుల క్షేమం కోసం గిరిజనుల పూజలు
- అమ్మ అనుగ్రహంతో రోగాలు తొలగుతాయని నమ్మకం
- రేపు తండాల్లో వేడుకలు

రుద్రంగి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : లంబాడీల ఆరాధ్యదైవం శీత్లాదేవి. ఆషాడం వచ్చిందంటే గిరిజన తండాల్లో పండగ వాతవరణంతో సందడి నెలకొంటుంది. తండా పెద్దమనిషి అనుమతితో ఆషాడంలో ఒక మంగళవారాన్ని ఈ పండుగ జరుపుకోవడానికి కేటాయిస్తారు. ఈ పండుగ చేయడం ద్వారా దేవి అనుగ్రహిస్తే పశుసంపద అభివృద్ధితో పాటు ప్రజలకు వ్యాధులు రావని లంబాడీల నమ్మకం. తెలంగాణలో పోచమ్మ బోనాల పండుగా మాదిరిగానే గిరిజనులు శీత్లాభవాని వేడుకలు జరుపుకుంటారు. గతంలో గిరిజనుల జీవన ఆధారం పశు సంపద. గిరిజనులు నిత్యం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడానికి పశుసంపదన ఉపయోగించుకునేవారు. పశుసంపద అభివృద్ధి కోసం గిరిజనులు శీత్లా భవాని దేవిని పూజిస్తారు. రుద్రంగి మండలం చుట్టూ ఉన్న గిరిజన తండాల్లో మంగళవారం శీత్లాభవాని పండుగను ఘనంగా నిర్వహించేందుకు ముస్తాబు చేస్తున్నారు. లంబాడీలు ఆషాఢ మాసంలో తండా పెద్ద మనుషుల అనుమతితో ఈ పండగను నిర్వహిస్తారు. గతంలో ఈ పండుగను కేవలం పశువులు ఉన్నవారే చేసేవారు. కానీ ఇప్పుడు అన్ని తండాల్లో గిరిజనులు నిర్వహించుకుంటున్నారు.

● ఆకట్టుకునే పూజా విధానం

పెద్ద పుష్యమి కార్తెలో శీత్లా మాతకు పూజిస్తారు. తండాలోని ఇళ్లలో కాకుండా దగ్గరలో ఉండే ఓ ఖాళీ ప్రదేశంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పొడవాటి రాళ్లతో తయారుచేసిన ప్రతిమలను ఏడుగురు భవానీలను వరుసలో తూర్పు దిక్కున ప్రతిష్టిస్తారు. భవానీల ప్రతిమలకు ఎదురుగా కొద్ది దూరంలో లుంకాడియా ప్రతిమను భవానీల వైపు చూసేలా నెలకొల్పుతారు.

● యువతులతో నైవేద్యం..



నైవేద్యం తీసుకొచ్చిన యువతులు(ఫైల్)

శీత్లా భవాని ప్రతిమలకు జాజు పూసి పువ్వులు, మామిడి ఆకులతో అలంకరిస్తారు. ఒక్కరోజు ముందు జొన్నలు, పప్పుధాన్యాలు కలిపి తయారుచేసిన గుగ్రిని తెల్లవారు జరిగే శీత్లా పండుగకు నైవేద్యంగా తీసుకెళ్తారు. దీనినే వాంసీడొ నైవేధ్యాన్ని యువతులు శీత్లా భవాని అమ్మవారికి సమర్పిస్తారు. శీత్లా భవాని మాతకు ఇళ్ల నుంచి తీసుకువచ్చిన పాయసం పూజలో ఉంచుతారు. వాంసీడొ నైవేధ్యాన్ని అన్ని పశువులపై పడేలా చల్లుతారు. దీని వల్ల పశుసంపద పెరుగుతుందని, పశువులకు ఎలాంటి వ్యాధులు రావని వారి నమ్మకం.

తెలుగు వెలుగు జాతీయ పురస్కారానికి ఎంపిక

- ఈ నెల 12న మహానంది అవార్డుల ప్రదానం



మల్లేశం, సంతోష్‌చారి

గంభీరావుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపే ట మండలంలో ఒకరు సేంద్రియ వ్యవసాయంలో, మరొకరు శిల్పకళలో రాణి స్తూ తెలుగు వెలుగు జాతీయ పురస్కారానికి ఎంపిక య్యారు. వీరిద్దరి నైపుణ్యా లను గుర్తించిన తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వస్చంద సంస్థ మహానంది అవార్డుకు ఎంపిక చేసింది. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బొంగు మల్లేశం అనే యువ రైతు సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాడు. ఐదేళ్లుగా ఆధునిక పద్ధతుల్లో సేంద్రియ వ్యవసాయ రంగంలో రాణిస్తు అందరి మన్ననలు పొందుతున్నాడు. దాదాపు 20 రకాల కూరగాయలను సాగు చేయడంతో పాటు జామ తోట పంటను పండించాడు. మండల కేంద్రానికి చెందిన వడ్రంగి చేపూరి సంతోష్‌చారీ అనే యువకుడు శిల్పకళా రంగంలో రాణిస్తున్నాడు. వండ్రంగి సంతోష్‌చారి తన కళా నైపుణ్యంతో మహానీయుల చిత్రాలు చెక్కాడు. బాబాసాహెబ్ అంబేడ్కర్, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ చిత్రాలతో పాటు అనేక రకాల వస్తువులను తన శిల్పకళతో చెక్కి సంతోష్‌చారి వార్తల్లోకి ఎక్కాడు. కాళోజీ తెలుగు బక్ ఆఫ్ రికార్డ్సు, తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 12న హైదరాబాద్ త్యాగరాయ గాన సభ వేదికలో వీరిద్దరికి మహానంది పురస్కారం ప్రదానం చేయనున్నారు. వీరిద్దరు నంది అవార్డుకు ఎంపిక కావడం పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల సందడి

- తొలి ఏకాదశి సందర్భంగా తరలివచ్చిన భక్తజనం
- స్వామివారికి ప్రత్యేక పూజలు, అఖండ భజన

వేములవాడ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ముందుగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. అనంతరం కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించకుని ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు.

● తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు..

రాజన్న ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి, పరివార దేవతలకు అభిషేకపూజ, అర్చనలు చేశారు. రుక్మిణి విఠలేశ్వర స్వామివారికి పంచోపనిషత్ ద్వారా అభిషేకం నిర్వహించి సాయంత్రం మహాపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత పూజ వరకు అర్చకులు, భక్తులు అఖండ పూజలో పాల్గొన్నారు.

● స్వామివారి సేవలో ప్రభుత్వ విప్..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఏఈవో శ్రీనివాస్ ప్రసాదాన్ని అందజేశారు.

ధర్మపురిలో..

ధర్మపురి (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో తొలి ఏకాదశి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళలో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు లక్ష్మీ నరసింహస్వామి, వేంకటేశ్వర స్వామి వారలకు అభిషేకం, పంచోపనిషత్తులతో మహా క్షీరాభిషేకం, తులసీ అర్చన, విశేష పూజా, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే యాగశాల వద్ద నారసింహ హవనం, స్వామి వారల నిత్య కల్యాణం నిర్వహించారు. భక్తులు ఉదయంనుంచి రాత్రి వరకు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, నంబి శ్రీనివాసాచారి, నరసింహమూర్తి, రమణాచార్యా, అభిషేక్ పౌరోహితులు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.





రాజరాజేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు, ధర్మపురిలో యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

● గోదావరి నదిలో పుణ్య స్నానాలు

తొలి ఏకాదశి పండుగ సందర్భంగా ధర్మపురి గోదావరి నదిలో ఆదివారం భక్తులు స్నానాలు ఆచరించారు. ఉదయం భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. నది వద్ద సైకత లింగాలు చేసి పసుపు, కుంకుమ చల్లి, కొబ్బెరికాయలు కొట్టి పూజించారు.

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పూజలు

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం సందర్శించారు. తొలి ఏకాదశి పురస్కరించుకుని ఆలయానికి విచ్చేసిన మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు ఆలయం వద్ద ఆయనకు వేదపండితులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వదించగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్ర, ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. అంతకు ముందు ఆయన స్థానిక రామలింగేశ్వర స్వామి, గణపతి, రావి చెట్టు ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆయన టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ధర్మకర్తల మండలి సభ్యులు ఉన్నారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు ఉదయ్‌కుమార్, ఉమాసాగర్, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు.

సీసీ రోడ్డు నిర్మాణం.. విద్యార్థులకు తప్పిన తిప్పలు





గతంలో బురదమయంగా మారిన మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాల రహదారి, నిర్మాణం అవుతున్న సీసీ రోడ్డు

కోనరావుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శరవేగంగా సీసీ, తారు రోడ్డు నిర్మాణం పనులు జరుగుతుండడంతో రెండు జిల్లాల వాసులకు కష్టాలు తప్పాయి. ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల నుంచి సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరగడంతో విద్యార్థులకు, అధ్యాపకులకు, ప్రజాప్రతినిధులకు తిప్పలు తప్పాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్ల నుంచి నిజామాబాద్ జిల్లాలను కలిపే ప్రధాన రహదారి రోడ్డు పనులు మరిమడ్ల నుంచి మానాల వరకు చురుగ్గా కొనసాగుతున్నాయి. దీంతో రెండు జిల్లాల వాసులకు కష్టాలు తప్పాయి. మరిమడ్ల గ్రామ శివారులో ఉన్న ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలకు గతంలో గుంతలు, బురదమయంగా రహదారి ఉండేది. అటుగా వెళ్లాలంటే విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు భయంగా వెళ్లేవారు. మరిమడ్ల నుంచి మానాల వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల ప్రధాన రహదారికి ఆరు కోట్ల రూపాయలను ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. మరిమడ్ల శివారులో ఉన్న ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల సుమారు ఒక కిలోమీటర్‌నర ఉంటుంది. సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో విద్యార్థులకు కష్టాలు తప్పాయి. మరిమడ్ల శివారు నుంచి ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల పక్కనుంచి మానాల వరకు తారు రోడ్డు నిర్మాణం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. తారు రోడ్డు నిర్మాణంతో రెండు జిల్లాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేద పండితుడికి ప్రశంస పత్రాలను అందజేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని, హైందవ సంస్కృతిలోని వేదాలను ప్రపంచంలోని పలు దేశాలు ఆచరిస్తున్నాయని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో అఖాల భారత వేద శాస్త్ర స్మార్త ఆగమ విద్వత్ సదస్సులో భాగంగా నిర్వహించిన చతుర్వేద స్మార్త పరీక్షల్లో ఉత్తీర్ణులైన వేదపండిత విద్యార్థులకు ఆదివారం పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా వేద పండిత విద్యార్థులకు నిర్వహించే చతుర్వేద స్మార్త పరీక్షలు వేములవాడ రాజన్న ఆలయంలో నిర్వహించడం గర్వకారణమని, అభినందనీయమని కొనియాడారు. హైందవ సంస్కృతిలోని వేదాలను ఇతర దేశాల వారు ఆచరిస్తున్నారని, దేవాలయాలకు రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతోందని అన్నారు. రానున్న రోజుల్లో వేద పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య మరింతగా పెరగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం వేద పండితులకు ఎల్లప్పు డు అండగా ఉంటుందని గుర్తు చేశారు. మన పూర్వీకులు తాలపత్ర గ్రంథాల ద్వారా వేదాలను మనకు అందించారని వివరించారు. గతంలో వేములవాడ రాజన్న ఆలయ చైర్మన్‌గా అనేక అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. రాజన్న ఆలయ విస్తరణ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నాని, నాలుగుసార్లు శృంగేరి వెళ్లి ఆలయ అభివృద్ధి విస్తరణ పనులపై పీఠాధిపతులతో చర్చించి ముందుకు వెళుతున్నామన్నారు. రూ. 47 కోట్లతో రోడ్డు వెడల్పు, రూ. 35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రూ. 150 కోట్లు రాజన్న ఆలయ అభివృద్ధికి కేటాయించడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు. రోడ్డు వెడల్పులో నిర్వాసితుల త్యాగం ఎప్పటికి మరువలేనిదన్నారు. భూనిర్వాసితుల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆలోచనలు చేస్తోందని తెలిపారు. వేద పండితులుగా పట్టాలు పొందుతున్న వేద విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పరీక్షాధికారులుగా వ్యవహరించిన వేద పండితులను ఘనంగా సన్మానించి ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాబాయి ఏఈవోలు, సూపరిండెంట్‌లు తదితరులు ఉన్నారు.

బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ నుంచి.. సినీ దర్శకుడి వరకు



- కంచు షార్ట్ ఫిలింకు ఆరు సీఐఎఫ్ఏ అవార్డులు
- దర్శకత్వంలో రాణిస్తున్న సంతోష్ నారాయణన్

వేములవాడ టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సినిమాలపై ఉన్న మక్కువతో ఓ యువకుడు షార్ట్‌ఫిలింస్, వెబ్‌సీరిస్‌లు రూపొందిస్తూ తన ప్రతిభను చాటుకుంటున్నాడు. పలు అవార్డులను కైవసం చేసుకున్నాడు. వెండితెరపై తన పేరును చూసుకోవాలని ఆరాటంతో మొదలైన అతడి ప్రయాణం విజయ పథంలో సాగిపోతున్నాడు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ గ్రామీణ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న సంతోష్ నారాయణన్..

వరంగల్ జిల్లాకు చెందిన నారాయణ-వీరమ్మ దంపతుల పెద్ద కుమారుడు సంతోష్ నారాయణన్ చిన్న తనం నుంచి సినిమాలు చూస్తూ వాటిపైన ఎంతో మక్కువను పెంచుకున్నాడు. చిన్నప్పటి నుంచి చదువులో టాపర్‌గా నిలిచిన నారాయణ్ సినిమాలపై ఉన్న ఆసక్తితో 2017వ సంవత్సరంలో అవకాశాల కోసం అన్వేషణ ప్రారంభించాడు. 'కనబడుటలేదు' 'ఆచూకీ' చిత్రాల డైరెక్టర్ బాలరాజు వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా అవకాశం వచ్చింది. రెండు సంవత్సరాల పాటు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూనే షూటింగ్‌లు లేని సమయంలో బ్యాంకు ఎగ్జామ్స్‌కు చదువుతూ ఒకేసారి 5 సెంట్రల్ గవర్నమెంట్ జాబ్స్ వచ్చాయి. సినిమాలపై ఉన్న ఆసక్తితో ప్రభుత్వ ఉద్యోగాలను వదులుకుని సినిమాల వైపే మొగ్గు చూపాడు. అయితే 2020ల ఎదురైన ఆర్థిక ఇబ్బందులతో బ్యాంకు ఉద్యోగంలో చేరాడు.



కెమెరాతో సంతోష్ నారాయణన్

● 'కంచు'తో అవార్డుల పంట పండింది..

సంతోష్ నారాయణన్ సమాజంలో జరుగుతున్న సంఘటనల ఆధారంగా వెబ్‌సిరీస్ 'కంచు' తీశాడు. మహిళా సాధికారతకు సంబంధించిన కథనం కావడంతో ప్రేక్షకులకు చేరువైంది. ఈ వెబ్ సిరీస్‌కు కొచ్చిన్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ అవార్డులు ఆరింటిని కైవసం చేసుకుంది. అంతే కాకుండా లండన్ లిఫ్ట్ ఆఫ్ సెషన్ అవార్డు, బ్రిటన్ ఫస్ట్ టైమ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డు, 2021 సంవత్సరం ముంబైలో నిర్వహించిన ఎన్ఏడబ్ల్యూఏడీఏ ఇంటర్ నేషనల్ ఫిల్మ్ అవార్డుల్లో చోటు దక్కించుకుంది. ప్రస్తుతం మూడు వెబ్ సిరీస్‌లు, రెండు సినిమాలకు డైరెక్టర్‌గా పని చేస్తున్నాడు.



నటులకు సూచనలు ఇస్తున్న సంతోష్ నారాయణన్

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



జయ్యారంలో మాట్లాడుతున్న ఎస్సై స్వామి

పాలకుర్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ఎస్సై స్వామి అన్నారు. ఆదివారం జయ్యారంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదా ర్థాలు, గంజాయి విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసు కుంటామన్నారు. గంజాయికి బానిసైన యువత నేరాలకు పాల్పడుతు న్నారన్నారు. సోషల్ మీడియాలో అనేక వెబ్‌సైట్ల ద్వారా ప్రజలను బురిడీ కొట్టించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, మరికొన్ని గ్రామాల్లో ప్రధానమైన చోట్ల ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛందంగా గ్రామస్థులు ముందుకు రావాలని సూచించారు.

నవోదయ, సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు శిక్షణ

కాల్వశ్రీరాంపూర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నవోదయ స్కూల్‌లో ప్రవేశాలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు హెడ్ మాస్టర్ ఈర్ల సమ్మయ్య ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచిత సౌకర్యాలతో పాటు ఉచితంగా ఆంగ్లం బోధించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

పాలకుర్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించాలని మండల ఇన్‌చార్జి కొండల రాజేందర్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలో పర్యటించారు. పలువురు ఎమార్పీఎస్ నాయకులను, కార్యకర్తలను కలిసి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ప్రతీ గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేయాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన

కోల్‌సిటీటౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన జరుగుతుందని రామగుండం మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రెండు జతల యూనిఫాం, స్కాలర్‌షిప్‌తోపాటు క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందిస్తోందని పేర్కొన్నారు. ఉచితంగా విద్యను అందిస్తుంటే ప్రభుత్వ పాఠశాలలను కాదని ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు రూపాయి ఖర్చులేని నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తెలిపారు.

ఘనంగా ఏకలవ్య జయంతి



నివాళులర్పిస్తున్న ఎరుకల ప్రజాసమితి నాయకులు

పెద్దపల్లి కల్చరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఏకలవ్య జయంతిని ఎరుకల ప్రజా సమితి జిల్లా అధ్యక్షుడు మానుపాటి రవి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత విలువైన గురుశిష్యుల బంధాన్ని ఆనాటి కాలంలోనే తెలిపిన వ్యక్తి ఏకలవ్యుడన్నారు. ఎరుకల కులస్తులకు ప్రభుత్వం స్థలాలను కేటాయించాలని, ఏకలవ్య విగ్రహాలు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో లోకిని శారద, మానుపాటి సంపత్, రేవెల్లి శీనయ్య, రేవెల్లి సుమన్, ఆంజనేయులు వెంకటేశ్, అల్లెపు ఆంజనేయులు, లోకిని సది, రేవెల్లి సమ్మవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలుకు వేలం

ఓదెల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి రాజ గోపాలస్వామి ఆలయం భూముల సాగు కోసం ఈ నెల 10న ఆలయం వద్ద వేలం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఈవో ప్రకటనలో తెలిపారు. 1079 సర్వే నంబరులో 26 గుంటలు, 1080 సర్వే నంబరులో ఎకరం ఒక గుంట, 1092 సర్వే నంబరులో 1.39ఎకరాల ఆలయ భూములను కౌలు చేసేందుకు రైతులు హాజరు కావాలని కోరారు. ఈ నెల 11వ తేదీ నుంచి 2026 జూన్ 31 వరకు కౌలు హక్కు ఉంటుందని, ముందుగా ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

కృష్ణానగర్‌లో హరితహారం



మొక్కలు నాటుతున్న యూత్ సభ్యులు

జ్యోతినగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో ఆదివారం భగవతి యూత్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలనీలో 250 మొక్కలను నాటారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని భగవతి యూత్ నాయకులు కోరారు. హరితహారంలో భగవతి యూత్ అధ్యక్షుడు కంకటి రవిగౌడ్, సభ్యులు వొల్లాల సురేష్, మామిడాల సంద్రయ్య, రాంపెల్లి శ్రీనివాస్, మాచిడి మహేందర్‌గౌడ్, పైడ సాయి, మామిడాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు రేబీస్ వ్యాక్సిన్

పెద్దపల్లిటౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జంతు సంక్రమిత వ్యాధుల నివారణ దినోత్సవం సందర్భగా ఆదివారం పశువుల ఆస్పత్రిలో పెంపుడు కుక్కలకు ఉచితంగా వ్యాక్సిన్లు వేశారు. అనంతరం డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న కుమారి మాట్లాడారు. పెంపుడు కుక్కలకు తప్పకుండా సమయానికి వ్యాక్సిన్లు వేయించాలన్నారు. పెంపకం, ఆహార విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏడీ శ్రీదేవి, డాక్టర్ సురేష్, అనీల్‌కుమార్, రేఖారాణి, ఖలీద్, రాకేష్ తదితరులు ఉన్నారు.

కంటి ఆపరేషన్‌లు

పెద్దపల్లి రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సబ్బితంలో మంత్రి శ్రీధర్‌బాబు జన్మదినం సందర్భంగా గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 20 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమైంది. మంత్రి శ్రీధర్‌బాబు హామీ మేరకు ఆదివారం యూత్ కాంగ్రెస్ నాయకులు గుమ్మడి ప్రసాద్ వారిని బస్సులో హైదరాబాద్ తరలించారు.

ఆర్టీసీలో మహిళా శక్తి

(5వ పేజీ తరువాయి)

రూపాయలను ఆర్టీసీకి అందజేశారు. ఆర్టీసీ బస్సును కొనుగోలు చేయడంతో పాటు డ్రైవర్, కండక్టర్లను వారే సమకూర్చుకుని, డీజిల్ ఖర్చు, బస్సు నిర్వహణ ఖర్చులు భరించుకుని, అద్దె కింద నెలకు 69,468 రూపాయల డబ్బులను మండల సమాఖ్యలకు ఏడు సంవత్సరాల పాటు అందజేసే విధంగా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అనంతరం బస్సులు ఆర్టీసీ సొంతం అవుతాయి.

● జిల్లా నుంచి తొమ్మిది బస్సులు

ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం, ఎలిగేడు, జూలపల్లి, ముత్తారం, ఓదెల, పెద్దపల్లి, సుల్తానాబాద్, అంతర్గాం, కమాన్‌పూర్ మండలాలకు చెందిన బస్సులను గోదావరిఖని, మంథని డిపోలో అద్దెకు పెట్టారు. మంథని డిపోలో 3 బస్సులు, గోదావరిఖని డిపోలో 6 బస్సులను ఏర్పాటు చేశారు. తద్వారా ఒక్కో బస్సుపై నెలకు 69.468 రూపాయల చొప్పున ఏడాదికి 8 లక్షల 33 వేల 616 రూపాయల ఆదాయం సమకూరనున్నది. ఏడు సంవత్సరాలకు 58 లక్షల 35 వేల 312 రూపాయల ఆదాయం రానున్నది. ఈ విధంగా సమకూరిన ఆదాయంతో మండల సమాఖ్యలు, గ్రామ సమాఖ్యలకు రుణాల రూపంలో తక్కువ వడ్డీకే ఇవ్వనున్నారు. ఆ డబ్బుతో మహిళలు స్వయం ఉపాధి పనులు చేసుకునేందుకు వీలుగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నది. అలాగే పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఒక పెట్రోల్ బంకును ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఈ మేరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఉన్న స్థలాన్ని పెట్రోల్ బంక్‌కు కేటాయిం చినట్లు తెలుస్తున్నది. త్వరలోనే వాటి పనులను ఆరంభించనున్నారు. మే 20 నుంచి జిల్లాలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయగా జూన్ 20వ తేదీ నాటికి ఈఎంఐ కింద తొమ్మిది బస్సులకు 6 లక్షల 25 వేల 212 రూపాయలు మహిళా సంఘాలకు విడుదల చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం మహిళా సంఘాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుండడంతో మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సమ్మెలో లారీ డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొనాలి

సుల్తానాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సమ్మెలో అసంఘటిత రంగ కార్మికులతోపాటు లారీ డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యం రావు అన్నారు. పూసాల పెద్దమ్మ గుడి ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం కలుగజేస్తూ యాజమాన్యాలకు లాభం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 9న సమ్మెకు పిలుపునిచ్చినట్లు వివరించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. తాండ్ర అంజయ్య, తిరుపతి, తిరుపతి రెడ్డి, మాతంగి రాజమల్లు, మల్లేష్ శంకర్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): జాతీయవాదమే శ్యామాప్రసాద్ ముఖర్జీ లక్ష్యమని, ఆయన అడుగు జాడల్లో ప్రతీ కార్యకర్త నడువాలని మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య అన్నారు. శ్యామ ప్రసాద్ జయంతి సందర్భంగా ఆదివారం శివాజీ నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో రెండు చిహ్నాలు, రెండు జెండాలు ఉండకూడదని పార్లమెంట్‌లో లేవనెత్తిన గొప్ప వ్యక్తి అన్నారు. ప్రజలను చైతన్యవంతం చేసి తన ప్రాణాన్ని దేశం కోసం అర్పించారని చెప్పారు. పెద్దపల్లి రవీందర్, మహవాది రామన్న, సోమారపు అరుణ్‌కుమార్, చంద్రశేఖర్, శ్రీనివాస్, నవీన్, చుక్కల రాములు, కొమ్ము స్వామి, శ్రావణ్ పాల్గొన్నారు.

దళిత బహుజనుల సంక్షేమానికి జగ్జీవన్‌రామ్ కృషి

మంథని, జూలై 6: దళిత, బహుజనుల సంక్షేమం, అభివృద్ధికి బాబుజగ్జీవన్‌రాం కృషి చేశారని బీఆర్ఎస్ నేతలు అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి పురస్కరించుకొని ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు, మంత్రి శ్రీధర్‌బాబు క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడిగా, దేశ ఉప ప్రధానిగా బాబు జగ్జీవన్‌రాం దేశ ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయన్నారు. యువత ఆయన స్ఫూర్తితో ప్రజా సేవ చేయాలన్నారు. మాచీడి రాజుగౌడ్, శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, కొత్త శ్రీనివాస్, గోటికార్ కిషన్‌జీ, మంథని సత్యం పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): దళిత అణగారిన వర్గాలకు బాబు జగ్జీవన్‌రామ్ కృషి చేశారని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. దేశ మాజీ ఉపప్రధాని దివంగత బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతి గోదావరిఖనిలో నిర్వహించారు. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన బాబుజగ్జీవన్ రామ్ వర్ధంతికి కాంగ్రెస్, బీఆర్ఎస్, టీబీజీకేఎస్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా నాయకులు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ఎస్ఐ గాలిపెల్లి నాగరాజు, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ గొర్రె రమేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఆర్జీ-1 ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్‌లు బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చందర్ మాట్లాడుతూ ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. బాబు జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని, దళిత అణగారిన వర్గాల చైతన్యం, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం కృషి చేస్తుందన్నారు. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి సతీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు బొంకూరి మధు, మైస రాజేష్, కనుకుంట్ల సమ్మయ్య,బాబు, ముస్తాఫా, గట్ల రమేష్, ధూళికట్ట సతీష్, పాల్గొన్నారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో దేశ మాజీ ఉపప్రధాని బాబుజగ్జీవన్ రామ్ వర్ధంతి నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. దాసరి విజయ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గట్ల రమేష్, ముస్తఫా, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చందర్

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో దేశ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, నాయకులు దుగ్యాల సంతోష్ రావు, కోరుకంటి వెంకటేశ్వర్ రావు, అర్షనపల్లి వెంకటేశ్వర్ రావు, నరహరి సుధాకర్ రెడ్డి, కాసర్ల మహేందర్, తాటిపల్లి రమేష్ బాబు, పెద్దపల్లి దేవరాజ్, అమ్ముల రమేష్, రంగు శ్రీనివాస్, ముంజం ముత్యాలు, ఓదెలు, రాజు, పొట్యాల రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



కాల్వశ్రీరాంపూర్‌లో పీరీల ఊరేగింపు

ఎలిగేడు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. నూతన వస్త్రాలు ధరించి మజీద్‌లలో నమాజ్ చదివి, పీరీలను పుర వీధుల గుండా నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మడిపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. హిందూ, ముస్లింల ఐక్యంగా జరుపుకునే పండుగ సందర్భంగా భక్తులు పీరీలను ఎత్తుకొని ఇంటింటికి తిరగగా, పలువురు కుడకలు, డబ్బులు, బెల్లం వేశారు. పీరీలను ఆలింగనం చేసుకుని కోరికలను విన్నవించారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): మండలంలో మొహర్రం వేడుకలు నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామాల్లో పీరీలను డప్పు చప్పు ళ్లతో ఊరేగించడంతోపాటు అగ్ని గుండాల ప్రవేశం జరిపించారు. అగ్నిగుండాల ప్రవేశ సమయంలో మహిళలు, పిల్లలు, యువకులు పెద్దఎత్తున హాజరయ్యారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): మంథని పట్టణంలో మొహర్రం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. దొంతులవాడలోని మజీద్ వద్ద వారం క్రితం ఏర్పాటు చేసిన పీర్లను భక్తిశ్రద్ధలతో పూజించారు. రోజువారిగా మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి చెరువులో పీర్లను నిమజ్జనం చేశారు.

వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు



కమాన్‌పూర్ ఆదివరాహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ, సుల్తానాబాద్‌లో పారాయణం చేస్తున్న మహిళలు

సుల్తానాబాద్, జూలై 6(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పురస్కరించుకుని ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. భూపతిపూర్‌లోని వేంకటేశ్వరస్వామి, దేవునిపల్లి నంబులాద్రి స్వామి ఆలయం, నీరుకుల్ల భూనీలాసమేత రంగనాయకస్వామి, రామునిపల్లి ఆలయాల్లో అభిషేకాలు, పారాయణాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సుల్తానాబాద్ వేణుగోపాల స్వామి ఆలయంలో అభిషేకం నిర్వహించారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండలంలో తొలి ఏకాదశి వేడుకలు ప్రజలు ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ఇండ్లల్లో పిండి వంటలు చేసి పండుగను జరుపుకోగా, భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంతో పాటు ఇతర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు తొలి ఏకాదశి పూజ నిర్వహించి మొక్కులు సమర్పించారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పురస్కరించుకొని గోదావరినదిలో భక్తులు ఆదివారం పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసులు గోదావరి తీరం వద్ద బందోబస్తు నిర్వహించారు.

మంథని రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో తొలి ఏకాదశి సందర్భంగా గోదావరి నది పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఉప్పట్ల, గాజులపల్లి, గుంజపడుగు, పోతారం, విలోచవరం, ఆరెంద గోదావరి నదిలో, ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకొన్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఆలయ ప్రాంగణంలో దాతలు అన్నదాన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయాన్ని భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. పాడిపంటలు, పశుసంపద వృద్ధి చెందాలని వేడుకున్నారు.

పాలకుర్తి,(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి సందర్భంగా బసంత్‌నగర్‌తోపాటు అన్ని గ్రామాల్లో వేడుకలను జరుపుకున్నారు. ఉదయం నుంచే ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఉద్యోగ, ఉపాధి పొందుతున్న పలువురు పండుగల వేడుకలకు స్వంత గ్రామాలకు రావడంతో గ్రామాల్లో సందడి పెరిగింది.

లఘు చిత్రాన్ని ప్రారంభించిన ఏసీపీ

కళ్యాణ్‌నగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న విప్లవం, రౌడీయిజంపై జరుగుతున్న వాటిలో మార్పు రావడం కోసం రాపెల్లి కుమార్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రక్షణ అనే లఘు చిత్రాన్ని ఆదివారం గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. గోదావరిఖని చౌరస్తాలో జరిగిన షూటింగ్‌ను ఏసీపీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్షణ అనే లఘు చిత్రంతో సమాజంలో కొంతైనా మార్పు వస్తుందని, గతంలో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో జరిగిన సన్నివేశాలను గుర్తు చేస్తూ నిర్మించడం హర్షనీయమన్నారు. నటీ నటులు రమాకాంత్, దామెర రాజేష్, ప్రభాస్, స్వరూపరాణి, నిఖిత, జక్కుల స్వప్న, చైతన్యరాణి, నిర్మల, రాజేశ్వరి, కళాకారులు దామెర శంకర్, దయానంద్‌గాంధీ, మేకల శ్రీకాంత్, వంగ శ్రీనివాస్, ఉపేందర్, చంద్రపాల్ పాల్గొన్నారు.

చిరు జల్లులకే బురదమయమైన రోడ్లు



శివాలయం వద్ద నిలిచిన నీరు, గుంతలమయమైన పోలీస్‌స్టేషన్ రోడ్డు

సుల్తానాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గుంతలమయమైన రహదారులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడిన ప్రతీ సారీ గుంతలలో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుంది. సుల్తానాబాద్ పాతబజార్ శివాలయం వద్ద వర్షం నీరు నిలిచి అసౌకర్యంగా మారింది. ప్రజలు కాలినడకన వెళ్ళలేని దుస్థితి ఏర్పడింది. ఇండ్ల ముందు ఇలా వరద నీరు నిలువడం వలన దోమల సమస్య ఏర్పడుతోంది. శివాలయం వద్ద సీసీ రోడ్డు పనులు నిలిచిపోవడంతో గుంతలు ఏర్పడి వరద నీరు నిలుస్తుంది. ప్రజలు ఇబ్బంది పడుతున్నా మున్సిపాలిటీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పాత బజారు శంకర్ లింగం చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ వెళ్ళే మరో రోడ్డు గుంతలయమై రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. చిరుజల్లులతో రహదారులు చిత్తడిగా మారుతున్నాయి.

సీపీఐ నాయకుడికి సన్మానం

కళ్యాణ్‌నగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఉక్కు కర్మాగారంలో 34సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన జీ ఆనంద్‌ను ఆదివారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు మాట్లాడుతూ ఆనంద్ ఉద్యోగానికి ముందు ఏఐఎస్ఎఫ్ జిల్లా నేతగా చేరి అంచెలంచెలుగా సీపీఐలో పని చేశారన్నారు. గౌతం గోవర్ధన్, తొడుపునూరి రమేష్‌కుమార్, లెనిన్, శనిగరపు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆశీస్సులుండాలి

గోదావరిఖని, జూలై 6(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గం ప్రజలపై పెద్దమ్మ తల్లి ఆశీస్సులుండాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ వేడుకున్నారు. ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరిని చల్లగా చూడాలన్నారు. నాయకులు నారాయణదాసు మారుతి, సట్టు శ్రీనివాస్, కోడి రామకృష్ణ పాల్గొన్నారు.

ఖనిలో భారీ వర్షం



కళ్యాణ్‌నగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతం ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం ఉదయం చిరు జల్లులు కురవగా రాత్రి భారీ వర్షం కురిసింది. 1.7సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. భారీ వర్షంలో రోడ్లు జలమయమయ్యాయి.

బీజేపీ మండల కార్యవర్గం

కాల్వశ్రీరాంపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావు ఆదేశాల మేరకు మండల కమిటీ ప్రకటించినట్లు మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ కుమార్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా పిల్లలమర్రి రాములు, యాట నరేష్, ఆరెల్లి తిరుమల, కూస వెంకటేష్, ప్రధాన కార్యద ర్శులుగా తోట శ్రీధర్, గరుడ కిషన్, పంజాల సతీష్, కొత్తకోట నాగరాజు, బంగారు సతీష్, కోశాధికారిగా కజ్జం రజిత, నియమించారు.

కార్యవర్గ సభ్యులుగా కోడూరి ఆంజనేయులు, లక్ష్మణ్, ఆళ్ల తిరుపతిరెడ్డి, ఏగోలపు రాజకుమార్, భూషణవేణ సంపత్, బైరి రామ్మూర్తి, వేణు, అజయ్, రాజేష్, మల్లేష్, లాల్‌మహ్మద్, బోయిని రాజు, రవి, సదయ్య, బాషమీయ తదితరులను నియమించినట్లు సంపత్ కుమార్ తెలిపారు.

మేడిపల్లి ఓసీపీని సందర్శించిన సీఎండీ



మేడిపల్లిని ఓసీపీని సందర్శిస్తున్న సీఎండీ బలరాం

గోదావరిఖని, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 ఏరియా పరిధిలో మూతపడిన మేడిపల్లి ఉపరితల గని పరిసర ప్రాంతాలను సింగరేణి సీఎండీ ఎన్ బలరాం ఆర్జీ-1 ఏరియా జీఎం లలిత్‌కుమార్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. భూగర్భ జలాల పెంపుదలకు, జీవావరణ వృద్ధికి, జలచరాలు, పశుపక్ష్యాదుల పెరుగుదలకు సింగరేణి వ్యాప్తంగా నిరుపయోగంగా ఉన్న ప్రదేశాలు, మూతపడిన ఓసీ సంపులు, ఓవర్ బర్డెన్ గుట్టల మధ్య మినీ చెరువులు, ప్రత్యేక నీటి కుంటల ఏర్పాటు, సహజ చెరువులు, కుంటల్లో నీటి నిల్వలకు 'సింగరేణి నీటిబిందువు జల సింధువు' పేరిట కార్యక్రమాలు చేపట్టాలని గతంలో సీఎండీ ప్రకటించారు. ఈ మేరకు సీఎండీ మూతపడిన మేడిపల్లి ఓసీపీని సందర్శించారు.



మేడిపల్లి ఓపెన్ కాస్ట్ ప్రాంతంలో సుమారు 6.26హెక్టార్ల విస్తీర్ణంలో 7జలాశయాల నిర్మాణం చేపట్టామని, చేపలు పెంచడం, జంతువులు, ప్రజల తాగునీటి అవసరాలకు ఏర్పాటు చేశామన్నారు. ఈ చెరువులలో బీ డంపింగ్ నుంచి వచ్చిన నీటితో నీరు నిండి నిల్వ ఉండి జీవరాశులకు ఉపయోగపడుతుందని సీఎండీ తెలిపారు. ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, మేనేజర్ మల్లిఖార్జున్ యాదవ్, డీజీఎం(ఫారెస్ట్) కర్ణ, ఎస్టేట్ అధికారి సాంబశివరావు, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి పాల్గొన్నారు.

సమాజ హితం కోసం పని చేద్దాం

గోదావరిఖని, జూలై 6(ఆంధ్రజ్యోతి): అంచలంచెలుగా ఎదిగిన కార్మిక నాయకుడు జక్కుల నారాయణను ఆదర్శంగా తీసుకొని సమాజ హితం కోసం పనిచేయాలని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్ఫూర్తి భవన్‌లో జక్కుల ఆత్మీయ సభ ఘనంగా నిర్వహించారు. సింగరేణిలో ఉద్యోగానికి మాత్రమే విరమణ జరిగిందని భావి జీవితమంతా ప్రజల కోసం పనిచేయాలని కోరారు. దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు ఫులిమోహన్ అధ్యక్షతన జరిగిన సభలో రియాజ్ అహ్మద్, మాదాసి రామమూర్తి, కంది రాజరత్నం, ముక్క సుదర్శన్, సోగాల వెంకటి, కుమార్, ఎజ్జ రాజయ్య, లక్ష్మణరావు, జూపాక పోశం, పాల్గొన్నారు.